
ఆంధ్రజ్యోతి
MAY
Happy Internation Workers Day
**
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
గురువారం 1 మే 2025

**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 66

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.155 | 235 | 260 |
| సూర్యాపేట | రూ.165 | 220 | 250 |
| నల్లగొండ | రూ.155 | 215 | 240 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.0


పేట సభలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

## తుంగతుర్తి
# కాంగ్రెస్‌లో చిచ్చు

- సూర్యాపేట జిల్లా పార్టీ సమావేశంలో రగడ
- ఎమ్మెల్యే వర్గంపై కాంగ్రెస్ పాత నేతల అసమ్మతి
- ఏడాది కాలంగా సాగుతున్న వర్గపోరు
- అధిష్ఠానం కలగజేసుకోకుంటే పరిస్థితి చేజారి పోతుందని కార్యకర్తల ఆందోళన

తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో వర్గపోరు ముదురుతోంది. మందుల సామేలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రెండు, మూడు నెలలపాటు కలిసికట్టుగా ఉన్న క్యాడర్‌లో ఆ తర్వాత విభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కుమ్ములాటల నేపథ్యంలో పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు నాయకులు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా, బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేయడం విభేదాలు తారస్థాయికి చేరాయని పార్టీ కార్యకర్తలు పేర్కొంటున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

సూర్యాపేటలో బుధవారం జరిగిన పార్టీ సమావేశానికి పీసీసీ పరిశీలకులుగా ఎమ్మెల్యేలు మురళీనాయక్, ఎడ్మబొజ్జు హాజరయ్యారు. ఎమ్మెల్యే సామేలు సమావేశంలోకి రాగానే వారి సమక్షంలోనే అర్వపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా ఎంపికచేసి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశం రసాభాసగా మారే పరిస్థితి నెలకొనడంతో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తదితర నాయకులు కలగజేసుకొని సమావేశంలో నిరసన లు వద్దని, ఇబ్బందులు, వాదనలను పార్టీకి నివేదించాలని సూచించి విషయం ముదరకుండా నిలువరించడంతో పరిస్థితి సర్దుమణిగింది.

### ఏడాదిగా గ్రూప్‌వార్

తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేలు ఎన్నికైన మూడు నాలుగు నెలల నుంచే వర్గవిభేదాలు మొదలయ్యాయి. నియోజకవర్గంలోని పాత కాంగ్రెస్ నాయకులకు, సామేలుతో కలిసి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొత్త కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు పొడసూపడంతో నియోజకవర్గవ్యాప్తంగా వర్గపోరు ప్రారంభమైంది. ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో పాత కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం దక్కడం లేదని, ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి వచ్చిన కార్యకర్తలకు మాత్రమే ఈ పథకాల్లో ప్రాధాన్యమిస్తున్నారని ఆయన్ను వ్యతిరేకిస్తున్న వర్గీయుల ప్రధాన ఆరోపణ. అయితే అలాంటిదేమీ లేదని, పార్టీలో అందరినీ కలుపుకుపోతున్నామని, సీనియర్లను గౌరవిస్తున్నామని సామేలు చెబుతున్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైనవారికే అవకాశం ఇస్తున్నారని, నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందనేది ఎమ్మెల్యే వర్గీయులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ప్రతీ మండలంలో బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తూ వారు చెప్పిందే అమలయ్యేట్టు అధికారులను ఎమ్మెల్యే పురమాయిస్తున్నారని, ఇటీవల చేపట్టిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులను సైతం బీఆర్ఎస్ నుంచి వచ్చిన, తనకు అనుకూలమైన వ్యక్తికే పనుల బాధ్యత అప్పగించారని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సామేలు తీవ్రస్థాయిలో విమర్శించిన బీఆర్ఎస్ నాయకుడినే ఇప్పుడు చేరదీసి, ఆయన కనుసన్నల్లో మండలాన్ని నడపాలని చూస్తున్నారని, మరో రెండు మండలాలకు చెందిన కీలక నాయకులిద్దరు ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలతో టచ్‌లో

### అధిష్ఠానానికి ఫిర్యాదులు

తుంగతుర్తి నియోజకవర్గంలో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయిన విషయం ఇప్పటికే అధిష్ఠానం దృష్టిలో ఉంది. గతంలో ఇలాగే అసమ్మతి కార్యక్రమాలు జరిగినప్పుడు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, తాజాగా పీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నాయి. నియోజకవర్గంలో సమన్వయ కమిటీని నియమించి, అసమ్మతి లేకుండా చేస్తామని పీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చినా ఇంతవరకు కమిటీ నియమించలేదు. తాజాగా మళ్లీ గలాటా జరగడంతో ఇకనైనా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి అసమ్మతిని సద్దుమణిచే చర్యలు చేపట్టాలని సీనియర్ నాయకులు విన్నవిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తినాల్సి వస్తుందని, పైగా పార్టీ పట్టుకోల్పోతుందన్న విషయాన్ని అధిష్ఠానం గ్రహించాలని సూచిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో...



# 10లో 14వ స్థానం

- 97.46 శాతం ఉత్తీర్ణత నమోదు
- 96.81శాతంతో రాష్ట్ర స్థాయిలో 14వ స్థానం, గతేడాది 6వ స్థానం
- యాదాద్రి జిల్లా ఏడో స్థానంలో, నల్లగొండ 11వ స్థానంలో..

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాల్లో 97.46శాతం ఉత్తీర్ణతతో బాలికలే పైచేయి సాధించారు. జిల్లాలో 11,887మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 11,508 మంది (96.81 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఆరో స్థానంలో ఉండగా, 14వస్థానానికి పడిపోయింది. యాదాద్రి జిల్లాలో మొత్తం 8,622మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 8,432మంది (97.80శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో యాదాద్రి జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. నల్లగొండ జిల్లాలో మొత్తం 18,636మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 18,054మంది (96.88 శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో నల్లగొండ జిల్లా 11వ స్థానంలో నిలిచింది.

జిల్లాలో బాలురు 6,077 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5,845మంది (96.18శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 5,810 మంది పరీక్షలకు హాజరుకాగా, 5,663 మంది (97.46 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు నేటి నుంచి 15 రోజుల్లోపు ఫీజు చెల్లించి అడ్వాన్స్ పరీక్షలకు హాజరుకావాలని డీఈవో అశోక్ తెలిపారు. జవాబుపత్రం రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షకు సబ్జెక్టుకు రూ.500 చెల్లిచాలని పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటలకు వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అపరాధ రుసుముతో మే 16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

## కష్టపడ్డ కార్యకర్తలకు
# గుర్తింపు ఉంటుంది

- టీపీసీసీ జిల్లా పరిశీలకుడు మురళీనాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్, పటేల్ రమేష్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకూ పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందని టీపీసీసీ పరిశీలకులు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటి కార్యకర్తలే కాబోయే నాయకులని నమ్మే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ప్రజల ఆశీర్వాదంతో గెలవడం ఖాయమన్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పథకాలు ప్రజల అభివృద్ధికి ఎంతగానో దోహపడుతున్నాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని ప్రతీ ఒక్కరికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యకర్తల సమస్యలను అధిష్ఠానం గమనిస్తుందన్నారు. ఎవరికీ అన్యాయం జరగదన్నారు.

కార్యక్రమంలో హస్త కళా కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణ, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, తండు శ్రీనివాస్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ గట్టు శ్రీనివాస్, చత్రురావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, తిరుమలప్రగడ అనురాధ, గోదాల రంగారెడ్డి, అబ్దుల్ రహీం, పూర రామూర్తియాదవ్, బైరు శైలేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటూ నినాదాలు

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా మారింది. ముఖ్యంగా ఎమ్మెల్యే సామేల్ డౌన్‌డౌన్ అంటూ కార్యకర్తలు నినదించారు. అనర్హులకు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన నాయకులకే ఇళ్లు కేటాయించారని ఆరోపిస్తు నిరసన వ్యక్తం చేశారు. కార్యకర్తలంతా స్టేజీ వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా నాయకులు అడ్డుకొని సర్దిచెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ అనర్హులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎక్కడా కూడా ఇల్లు కేటాయించలేదన్నారు.

# సమస్యల పరిష్కారానికే 'భూభారతి'


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

మేళ్లచెర్వు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ధరణిలోని లోపాలను సరిచేసి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ భారతి చట్టం ఉద్దేశమని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. భూభారతి చట్టంపై మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపం, చింతపాలెంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ తగాదాలు, హద్దుల పంచాయితీలను భవిష్యత్తులో నివారించడానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. గ్రామాల్లో అధికార, వికేంద్రీకరణ ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తామని, గ్రామాల్లోని చిన్న,సన్నకారు రైతులకు ఉచిత న్యాయ, సహాయం చేస్తామన్నారు. గ్రామాల్లో జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో భూ భారతి చట్టం అమల్లోకి వస్తుందన్నారు.గతంలో తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల దరఖాస్తులన్నీ పరిష్కరిస్తామన్నారు. ఎమ్మార్వో జ్యోతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు.

### పెట్రోల్ బాటిల్‌తో యువకుడి హల్‌చల్

చింతలపాలెం మండలకేంద్రంలో భూ భారతి అవగాహన కార్యక్రమం ప్రారంభానికి ముందే అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసుల సమక్షంలో పెట్రోల్ డబ్బాతో యువకుడు హల్‌చల్ చేశాడు, గుడిమల్కాపురానికి చెందిన దొంగల నాగరాజు అనే యువకుడు దొండపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 187-200 నెంబర్లలో తన పూర్వీకుల ఆస్తి వివాదంలో ఉందని,ఎన్నిసార్లు తహసీల్దార్ కార్యాలయానికి తిరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదని వాపోయాడు. ఆర్డీవో శ్రీనివాసులు, పోలీసులు, స్థానికులు అతనిని నివారించారు. సమావేశానికి హాజరైన కలెక్టర్ ఇటువంటి భూ వివాద సమస్యలు గ్రామాల్లో కోకొల్లలుగా ఉన్నాయని,భూ భారతి చట్టం పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన వెంటనే తన భూమిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితుడునికి హామీ ఇచ్చారు.

### జలవిద్యుత్ కేంద్రంలో కలెక్టర్

చింతలపాలెం మండలం వజినేపల్లి సమీపంలోని పులిచింతల ప్రాజక్టులోని తెలంగాణ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సందర్శించారు. విద్యుత్ కేంద్రంలో విద్యుత్ తయారీ విధానాన్ని జెన్కో ఎస్ఈ దేశ్యానాయక్ ద్వారా వివరాలు తెలుసుకొని ప్రస్తుతం ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అడిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీలార్లు జ్యోతి, సురేందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారిని పద్మ, ఎంపీడీవో ఖాజా అసర్గ్అలీ, చింతలపాలెం ఎంపీఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

సూర్యాపేట(కలెక్టరేట్): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అన్నారు. మండలంలోని నెమ్మికల్‌లో వివాదాస్పద భూమి పట్టా విషయమై విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పి. రాంబాబును నియమిస్తున్నట్లు తెలిపారు. వివాదాస్పద భూమి పట్టా విషయం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగుల పనితీరుపై విచారణ చేసి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

# సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి



మిర్యాల గ్రామంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

నూతనకల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజల మధ్య వచ్చే చిన్నచిన్న సమస్యలను గ్రామ స్థాయిలోనే అధికారులు, పెద్దమనుషుల సమక్షంలో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని మిర్యాల గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రజాభరోసా సభలో ఆయన మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని క్షణికావేశానికి వెళ్లి నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో రక్షణ నిమిత్తం గ్రామ పోలీస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తప్పులు చేస్తే ఏనాటికైనా శిక్షలు తప్పవన్నారు. ప్రజల మధ్య మంచి సంబంధాలు ఉండాలన్నారు. ఎన్నికలు వస్తాయి, పోతాయి, కానీ ప్రజలు ఎల్లప్పుడూ కలసిమెలసి ఉండాలన్నారు. మిర్యాలలో జరిగిన హత్యకు సంబంధించి పోలీస్‌శాఖపై గ్రామస్థులు విశ్వాసం ఉంచినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ పార్థసారధి, తుంగతుర్తి సీఐ నర్సింహారావు, ఎస్‌బి సీఐ నాగభూషణం, ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ప్రమోషన్లతో పాటు బాధ్యతలు పెరుగుతాయి

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయని ఎస్పీ అన్నారు. జిల్లాలోని తొమ్మిది మంది ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతు లు పొందడంతో వారు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, ఆర్ఐ నారాయణరాజు పాల్గొన్నారు.

### పోలీస్ శాఖలో సేవలు అందించడం అభినందనీయం

పోలీస్‌శాఖలో 36ఏళ్ల సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న సురేంద్రబాబు పదవీ విరమణ సందర్భంగా దంపతులను సన్మానించి, మాట్లాడారు. క్లిష్టమైన పోలీస్ ఉద్యోగ విధుల నిర్వహణలో గృహిణిగా భర్తకు సహాయసహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవన్నారు.

## అకాల వర్షంతో
# రైతుకు నష్టం


తిరుమలగిరి మండలం మాలిపురం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

జిల్లాలో బుధవారం తిరుమలగిరి, నాగారం మండలాల్లో అకాల వర్షం కురిసింది. కొద్దిరోజులుగా కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. ఉదయం నుంచి తీవ్ర ఎండతీవ్రతతో ఉన్న వాతావరణం సాయంత్రానికి చల్లబడి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సకాలంలో మిల్లులకు తరలించి ఉంటే ధాన్యం తడిసేది కాదని నాగారం రైతులు వాపోయారు.

- వివరాలు 7లో

# ఆశలు శిథిలమై..

- ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఘటనలో మూడుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం
- ఇచ్చేందుకు అంగీకరించిన కంపెనీ యాజమాన్యం



ముగ్గురూ 32ఏళ్ల లోపు వారే.. ఇద్దరు వివాహితులు.. ఒకరికి రెండేళ్ల కుమారుడు ఉండగా, ఒకరి భార్య ఐదు నెలల గర్భిణీ.. ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు ఘటనలో వీరు మృత్యువాత పడగా, బుధవారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. వీరిని తలుచుకొని రోదిస్తున్న కుటుంబాలను ఓదార్చడం ఎవ్వరితరం కాలేదు. ఇదిలా ఉండగా, మృతుల కుటుంబీకులకు రూ.కోటి చొప్పున పరిహారం ఇచ్చేందుకు కంపెనీ అంగీకరించింది. అందులో భాగంగా తొలుత రూ.50లక్షల చెక్కును అందజేసింది.

- (ఆంధ్రజ్యోతి, మోటకొండూరు) •6లో..

# ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ప్రాధాన్యం

### బార్ అసోసియేషన్ పాలకవర్గం ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారంలో పాల్గొన్న బార్‌అసోసియేషన్ కమిటీ

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థకు ఎంతో ప్రాధాన్యముందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నారపరాజు శ్రీనివాసరావు, నట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం బార్‌అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థ పటిష్ఠతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం పెంచేలా పనిచేయాలన్నారు. లోక్‌అదాలత్ విజయవంతంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా పనిచేస్తోందన్నారు. ఇదిలా ఉండగా తొలుత ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ న్యాయవాది కాలువ శ్రీనివాసరావును ఎన్నుకోగా ఎన్నికల అధికారులు సుందర రాఘవరావు, వట్టికూటి అంజయ్యలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, ఉపాధ్యక్షులు జక్కుల నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా చెనగాని యాదగిరి, సంయుక్త కార్యదర్శిగా కొట్టు సురేష్, గ్రంథాలయ కార్యదర్శిగా విశ్వనాథం, కోశాధికారిగా గోపాలకృష్ణమూర్తి, ఈసీ మెంబర్లుగా చిట్టిపోతుల రమేష్, శ్రీనివాస్, సైదా హుస్సేన్, నాగార్జున ప్రశాంత్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. పీఆర్‌వోగా కాలువ శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా కోల రమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

## 'పది' ఫలితాల్లో
# సిటీ టాలెంట్

- 595/600 సాధించిన సాయిసృజన
- మరో 10 మందికి 571కి పైగా..

## 'జయ' ప్రభంజనం

- 587 మార్కులతో ఐదుగురు విద్యార్థులు

వివరాలు 6లో

క్రైం పాయింట్ Crime point

## ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్ గ్రామానికి చెందిన జిల్లా యాదగిరి(45) 2020 సంవత్సరం నుంచి నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్నాడు. వృత్తిపరంగా బిల్డర్ అయిన యాదగిరి వ్యాపారంలో నష్టాలు రావడంతో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం తెల్లవారుజామున వాకింగ్‌కు అని చెప్పి బయటకు వెళ్లాడు. గ్రీన్‌హిల్స్ కాలనీలో ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, స్థానికులకు సమాచారం అందించారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉపాధి కూలీలకు గాయాలు

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల వద్ద ఆరుగురికి కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తిమ్మాపురంలో జరిగింది. కూలీలు తెలిపిన వివరాల ప్రకారం ఉపాధిహామీ పథకంలో చెట్లు తొలగించే పనులకు గ్రామానికి చెందిన కూలీలు వెళ్లారు. ముళ్ల చెట్లు తొలగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనున్న మరో పెద్ద ముళ్ల చెట్టు ఒక్కసారిగా కూలీలు బట్టు గంగమ్మ, బట్టు రేఖ, కొసన మమత, తుమ్మల రాణి, కొసన కౌసల్య, కౌకుంట్ల కృష్ణారెడ్డిలపై కూలింది. దీంతో చెట్టు ముళ్లపొదల కింద కూలీలు చిక్కుకుపోయారు. కూలీలు ఒక్కసారిగా కేకలు వేయడంతో పక్కనున్న కూలీలందరూ వారిని బయటకుతీశారు. ఈ ప్రమాదంలో బట్టు గంగమ్మ, కొసన మమతలకు తీవ్రంగా గాయాలు కాగా, బట్టు రేఖ, తుమ్మల రాణి, కొసన కౌసల్య, కౌకుంట్ల క్రిష్ణారెడ్డిలు స్వల్పంగా గాయపడ్డారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## బాలిక అనుమానాస్పద మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండకింద ఉన్న పుష్కరిణి చెంత బుధవారం గుర్తుతెలియని బాలిక మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక వయసు సుమారు 10 నుంచి 12 ఏళ్లు ఉంటుందని, కల్యాణకట్ట వద్ద విధులు నిర్వహిస్తున్న (శానిటేషన్ విభాగానికి చెందిన) గొల్లెపల్లి సాయికుమార్ ఉదయం 9.30 గంటలకు అందించిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## బాలికపై యువకుడి అత్యాచారయత్నం

గరిడేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో పదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేశాడు. ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో పదేళ్ల బాలిక తన అమ్మమ్మ ఇంటి ఎదుట తోటి పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో కరెంట్‌పోయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ అమరారపు సాయి అక్కడికి వెళ్లి బాలిక నోరు మూసి ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో అక్కడే వదిలేశాడు. అర్ధరాత్రి సమయంలో మరోమారు బాలిక ఇంటికి వెళ్లి అత్యాచారయత్నం చేయడంతో బాలిక కుటుంబసభ్యులు మేల్కొవడంతో ఆ యువకుడు పరారయ్యాడు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించామని, రిపోర్టు రావాల్సి ఉందని ఎస్ఐ నరేష్ తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఆశలు శిథిలమ్మై..



రాస్తారోకో చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

**కష్టంతో నెట్టుకొస్తున్న కుటుంబాలను నెట్టుకొస్తున్న యువకులు వారు. భవిష్యత్‌పై భరోసాతో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కలోగంజో తాగుతూ తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో కుటుంబాలతో గడుపుతున్నారు. వారి ఆనందాలను పేలుడు ఘటన ఛిద్రం చేసింది. చేదోడువాదోడుగా నిలుస్తున్న కుమారులను ప్రమాదం పొట్టన పెట్టుకుంది. మంగళవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందాడు.**

మోటకొండూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉన్నదాంట్లో ఆనందంగా గడుపుతున్న కుటుంబాల్లో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. భవిష్యత్‌పై అల్లుకున్న ఆశలను ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు ఘటన పేకముక్కల్లా కూల్చేసింది. చనిపోయిన వారిని తలుచుకుని రోదిస్తున్న తీరు కన్నీరుపెట్టిస్తోంది. కడుపుతో ఉన్న భార్య, నాన్నెప్పుడు వస్తాడని ఎదురుచూస్తున్న రెండేళ్ల కుమారుడు, భర్తను కోల్పోయి అన్నీ కుమారుడిలోనే చూసుకుంటున్న తల్లికి ఇక వారు రారూ అన్న సంగతి జీర్ణించుకోలేని పరిస్థితి. ఉపాధి చూపిన కంపెనీతో ఉసురుతీసిందని కన్నీరుమున్నీరయ్యారు. అశ్రునయనాల మధ్య వారి అంత్యక్రియలు బుధవారం పూర్తయ్యాయి.

### మూడుకు చేరిన మృతులు

మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌లో పేలుడులో ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. 18-ఏ బిల్డింగ్‌లో శ్రీహరికోటలో చేసే రాకెట్‌లాంచ్‌లో ఉపయోగించే ప్రొఫలెంట్‌ను తయారుచేస్తుండగా మంగళవారం సాయంత్రం భారీపేలుడు జరిగింది. ఆ సమయంలో తొమ్మిదిమంది పనులు చేస్తుండగా కూలిన భవనం కింద ఇద్దరు కార్మికులు చిక్కుకోగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నరేష్ అనే కార్మికుడు మృతి చెందాడు. మిగతా వారికి చికిత్స అందిస్తున్నారు. శిథిలాల్లో చిక్కుకున్న చందోజు దేవిచరణ్(22), మండలంలోని కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్(30)లను బుధవారం వేకువజామున ఫైర్, పోలీస్ సిబ్బంది సహాయంతో వెలికితీయగా వారు అప్పటికే మృతి చెందారు. మృతదేహాలకు భువనగిరిఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు తరలించి, గ్రామస్థులు భారీగా తరలిరాగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

### నాలుగు గంటల పాటు రాస్తారోకో

ప్రీమియర్ కంపెనీలో పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒంటి గంట వరకు రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. దీంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ కావడంతో పోలీస్‌లు వాహనాలను ఇతర గ్రామాల మీదుగా దారి మళ్లించారు.

### మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున..

ప్రీమియర్ కంపెనీలో పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారంతో పాటు తక్షణ సహాయంగా రూ.50 లక్షలు కంపెనీ యజమాన్యం ప్రకటించింది. దీంతో పాటు ఇతర ఇన్సూరెన్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.5లక్షలతో పాటు పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులు భరిస్తామని అంగీకరించింది. దీంతో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

### ఒంటరైన తల్లి



మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన చందోజు గోవిందమ్మ కూమరుడు దేవిచరణ్(22) మూడేళ్లుగా ప్రీమియర్ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. చిన్నతనం నుంచే తండ్రికి దూరంగా ఉంటున్న తల్లి వద్ద గారాబంగా పెరిగాడు. అతడికి ఏ కష్టం రాకుండా కుట్టుమిషన్ కుడుతూ ఇంటర్ వరకు చదివించింది. తల్లి కష్టాన్ని చూస్తూ ఉండలేక కంపెనీలో చేరి కుటుంబానికి అండగా ఉంటున్నాడు. అతడి మృతితో తల్లి గోవిందమ్మ రోదనలు స్థానికులను కలిచివేశాయి. భర్త దూరమై, కుమారుడు కాటికి చేరడంతో ఆమె ఒంటరిగా మిగిలిపోయింది.

అరణ్య రోదన



రోదిస్తున్న సందీప్ తల్లి, భార్య నిఖిత

### పెళ్లయిన ఆరు నెలలకే..



మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల సందీప్(30)కు చీకటిమామిడి గ్రామానికి చెందిన నిఖితలో ఆరు నెలల క్రితమే వివాహమైంది. 2019 నుంచి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం పేలుడులో సందీప్ మృతి చెందాడు. భార్య నిఖిత ప్రస్తుతం గర్భిణి, మరో రెండు రోజుల్లో సీమంతం చేద్దామని నిశ్చయించుకున్నాడు. కానీ అంతలోనే విధి వక్రించింది. తల్లి మంగమ్మ కులీ పనులకు వెళ్తుంది. తండ్రి శ్రీనివాస్ 2021లో గ్రామంలో కొంతభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు సాగులో నష్టాలు రావడంతో 2021లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాడు తండ్రి, నేడు కుమారుడిని కోల్పోయి తల్లి, భర్తను కోల్పోయి ఇల్లాలు గుండెలవిసేలా సందీప్‌ను గుర్తు చేసుకుని రోదించారు.

### రెండేళ్ల కుమారుడు..

ప్రీమియర్ కంపెనీ పేలుళ్లలో ఆత్మకూరు(ఎం) మండలకేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) మృతిచెందాడు. అతడికి నాలుగేళ్ల కిందట వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన జయంతితో వివాహమైంది. వీరికి కుమారుడు విశ్వతేజ్(2) ఉన్నాడు. నరేష్ తల్లిదండ్రులు మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వివాహఅనంతరం వేరేకాపురం ఉంటున్నారు. ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం మండలంలోని ప్రీమియర్ కంపెనీలో చేరాడు. పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రెండేళ్ల కుమారుడితో భార్య రోదనలు అందరినీ కదలించాయి.



రోదిస్తున్న నరేష్ కుటుంబ సభ్యులు

### ధనార్జనే ధ్యేయంగా యాజమాన్యం తీరు

**ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య..**

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ యజమానుల ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండా కార్మికులతో పనులు చేయిస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మండిపడ్డారు. కంపెనీలో పేలుడు జరిగిన ప్రదేశాన్ని బుధవారం వారు పరిశీలించారు. పేలుడుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు. వారి వెంట ఆలేరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు యెల్లంల సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, కొంతం మోహన్‌రెడ్డి, భూమండ్ల శ్రీనివాస్, గంధమల్ల జహంగీర్ పాల్గొన్నారు.



సంఘటన వివరాలను తెలుసుకుంటున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య

### ఒక్కొక్కరికి రూ.5కోట్లు ఇవ్వాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ప్రీమియర్ కంపెనిలో పేలుడులో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5కోట్లు, క్షతగాత్రులకు రూ.2కోట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూదగాని హరిశంకర్ గౌడ్ డిమాండ్ చేశారు. కాటేపల్లిలోని ప్రమాదానికి కారణమైన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీని వారు బుధవారం పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడారు. ప్రభుత్వం తరుపున న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మల్లన్న

## తుంగతుర్తి కాంగ్రెస్‌లో చిచ్చు

(5వ పేజీ తరువాయి)

ఉన్నారని ఆరోపిస్తున్నారు. అలాంటి వారిని నమ్మి ఎమ్మెల్యే, నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేస్తున్నారని, దీంతో పార్టీ బలహీనపడుతోందని వ్యతిరేకవర్గ నాయకులు విమర్శిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే వర్గీయులు మాత్రం ఇదంతా ఓర్వలేక చేస్తున్నారే తప్ప ఆరోపణల్లో వాస్తవం లేదని, పార్టీలో ఎమ్మెల్యే అందరికీ సమప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు సమాంతరంగా వర్గాన్ని నడపాలని, ప్రభుత్వ వ్యవహారాలను తమ గుప్పిటపట్టాలని చూస్తున్న నాయకులే దీనంతటికీ కారణమని, అసలైన నాయకులు, కార్యకర్తలకు ఎక్కడా ఇబ్బంది లేదని, ఇదంతా కొందరు నేతలు కుట్రతో ప్రోత్సహిస్తుండడం వల్లే అసమ్మతి ఘటనలు జరుగుతున్నాయని సామేలు వర్గీయులు చెబుతున్నారు.

## మూగజీవాల సంచారం.. గాలిలో ప్రాణం

**వరి కోతలు పూర్తికావడం, వేసవి రావడంతో మేత కోసం గేదెలను యజమానులు వదిలేస్తున్నారు. దీంతో అవి జాతీయ రహదారులపైన డివైడర్ల మధ్యలోని మేతకోసం సంచరిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారతున్నాయి.**

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని తమ్మర వద్ద గేదెను ఢీకొని పోస్టల్ ఉద్యోగి మృతి చెందారు. అంతేకాక గత నెల 26 రాత్రి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆకుపాముల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదే కనిపించక బైక్‌పై వెళ్తున్న అన్నాచెల్లెళ్లు దానిని ఢీకొన్నారు. దీంతో చెల్లెలు మృతి చెందగా, అన్నకు తీవ్రగాయాలయ్యాయి. వేసవి కాలంలో జాతీయ రహదారి వెంట గ్రామస్థులు పశువులను మేత కోసం వదులుతుండటం, అవి మేత కోసం డివైడర్‌ల మధ్య ఉండే గడ్డికోసం హైవేలపైకి వెళ్తున్నాయి. గడ్డి తిని ఒకేసారి రహదారిపై రావటం, వేగంగా వస్తున్న వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదానికి గురికావాల్సి వస్తోంది. మేత కోసం రహదారులకు ఇరువైపులా ఉండే వ్యవసాయ పొలాలకు వెళ్తుంటాయి. రాత్రివేళ గ్రామాల నుంచి ఒక్కసారిగా రహదారులపైకి వస్తుడటంతో వాహన లైట్ల కాంతికి అవి కనిపించక ప్రమాదాలు జరగటం నిత్యకృత్యమైంది. గేదెలు ఢీకొన్న సంఘటనలలో పదుల సంఖ్యలో వాహనదారులు క్షతగాత్రులయ్యారు. గేదెలను వదలవద్దని పంచాయతీ సిబ్బంది, పోలీసులు, హైవే అధికారులు గ్రామాల్లో డప్పుచాటింపులు చేస్తున్నా, నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని రహదారి వెంట గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.వారి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు పోతున్నాయి. అంతేకాకుండా కొన్నిసందర్భాల్లో గేదెల యజమానులు కూడా ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా గేదెలను రహదారులపైకి వదలవద్దని వాహన దారులు సూచిస్తున్నారు.



కోదాడ-ఖమ్మం జాతీయ రహదారిపై సంచరిస్తున్న గేదెలు

## అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్, పక్కన డీఎస్పీ రాజశేఖరరాజు, ఇతరులు

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఖరీదైన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.26.50లక్షల విలువైన 14వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం తెల్లవారుజామున వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన నలమాల ఎర్రబ్బాయి, అదేగ్రామానికి చెందిన గుంజి అంకమరావులు ఓ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని దామరచర్ల, నల్లగొండ పట్టణం, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్తూరు, పొన్నూరు పట్టణాల్లో రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపిఉంచిన వాహనాలను చోరీచేస్తున్నట్లు వారు అంగీకరించారు. వీరిద్దరితోపాటు పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జానపహాడ్‌కు చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

### విలువైన బైక్‌లే లక్ష్యంగా..

నలమాల ఎర్రబ్బాయి, గుంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్‌లు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎర్రబ్బాయి మూడేళ్లుగా నల్లగొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, జనసంచారం ఉన్న హోటళ్లు, వైన్స్‌ల వద్ద, రాత్రి పూట ఇంటి ముందు పార్కు చేసి ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ మోటార్ సైకిళ్లను చోరీ చేసేవారు. తన వద్ద ఉన్న పాత తాళాలతో దొంగతనాలు చేసి తన స్నేహితులైన మిగతా ఇద్దరు వ్యక్తులతో కలిసి వాటిని తక్కువ ధరకు విక్రయించి వచ్చిన నగదుతో జల్సాలు చేసేవారు. దొంగిలించిన వాహనాన్ని విక్రయించేందుకు బయలుదేరి పోలీసులకు చిక్కారు. ఈ ముగ్గురు నల్లగొండ జిల్లాలో గతంలో 66 ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. విచారణలో భాగంగా నేరం అంగీకరించటంతో వారినుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఏడు పల్సర్, ఒక షైన్ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. 14వాహనాల విలువ రూ.26.50లక్షలు ఉంటుందని, నిందితులు చోరీ చేశామని అంగీకరించిన మరో 22 వాహనాలను స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ తెలిపారు. వాహనాల చోరీ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డానియేల్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది సతీష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్‌రెడ్డిలను ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

## 'పది'లో సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



సాయి సృజన, ప్రణవి, శ్రీజ, హర్షిత, ప్రజ్ఞారెడ్డి, సుదీప్తారెడ్డి



సాయిగోకుల్, శిశిర, కశ్యప్‌రామ్, సాయి రిష్విక్, నితీషావర్ధిని

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిటీ టాలెంట్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎస్.సాయిసృజన 600మార్కులకు గాను 595 మార్కులతో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా బీ.ప్రణవి 588, జీ.శ్రీజ 583, పీ.హర్షిత 581, వై.ప్రజ్ఞారెడ్డి 579, ఎస్.సాయిగోకుల్ 577, వై.శిశిర 577, ఎన్.సుదీప్తారెడ్డి 577, ఐ.కశ్యప్‌రామ్ 575, ఎం.సాయి రిష్విక్ 573, జీ.నితీషావర్ధిని 571 మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## ఫలితాల్లో 'జయ' పాఠశాల ప్రభంజనం



ఉత్తమ ప్రతిభ కనబర్చిన జయపాఠశాల విద్యార్థులు

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలకు చెందిన ప్రతి ఐదుగురు విద్యార్థులు 587మార్కులతో అన్ని సబ్జెట్లలో అత్యధికంగా ఏ-1 గ్రేడ్ సాధించారని పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ప్రతి ఐదుగురు విద్యార్థులు 587 మార్కులతో పాటు అన్ని సబ్జెట్‌లలో అత్యధికంగా ఏ-1 గ్రేడ్ సాధించారని తెలిపారు. పాఠశాల నుంచి 580 మార్కులు 15మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బింగి జ్యోతి, జెల్లా పద్మ పాల్గొన్నారు.

## నిజమైన పేదలకే సంక్షేమ పథకాలు



మునుగోడు మండలకేంద్రంలో ఆధునీకరించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ కాంగ్రెస్ పాలనలో నిజమైన పేదలకు సంక్షేమాభివృద్ధి పథకాలుదక్కాలన్నదే తమ లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గకేంద్రంలో ఆధునీకరించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ భవనం, అదనపు గదుల నిర్మాణంతో పాటు సమావేశ మందిరాన్ని బుధవారం ఎమ్మెల్యే దంపతులు కలిసి ప్రారంభించారు. ముందుగా పురోహితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికైన క్యాంప్ కార్యాలయం శాశ్వతంగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు కాదని, నిర్ధేశించిన నిబంధనల ప్రకారం అర్హులకే స్థానం ఉంటుందన్నారు. అనంతరం భవనంలో ఇందిరమ్మ గృహాల మంజూరుపై నియోజకవర్గ స్థాయిలో నాయకులతో తొలిసారిగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ పున్న కైలాష్‌నేత, మాజీ అధికార ప్రతినిధి నారబోయిన రవిముదిరాజ్, చండూరు ఏఎంసీ చైర్మన్ దోటి నారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, భీమనపల్లి సైదులు నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు కార్యకర్తలు , వివిధశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ● మేమంతా ఒక్కటే.. బొడ్రాయి ఉత్సవాలకు ముస్లిం విరాళం



రాజాపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పాముకుంట మధిర గ్రామమైన కాశగూడెం ముస్లింలు ఆదర్శనంగా నిలుస్తున్నారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠా ఉత్సవాలను నిర్వహిస్తుండగా తాము కూడా ఉత్సవాల్లో భాగస్వాములవుతామని ముందుకువచ్చారు. కాశగూడెంలో 524మంది ముస్లిం జనాభా ఉండగా, వారంతా కలిసి ఉత్సవ నిర్వాహకులకు రూ.23,700లను విరాళం బుధవారం అందజేశారు. పీర్ల పండుగలో హిందువులు, బొడ్రాయి ఉత్సవాల్లో ముస్లింలు భాగస్వాములవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు.





సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో ఈత కొడుతున్న యువకులు





నిర్మానుష్యంగా ఉన్న భువనగిరి- రాయగిరి బైపాస్ రోడ్డు

నల్లగొండలో...

# సూర్య ప్రతాపం

భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇళ్లలో నుంచి బయటికి వెళ్లాలంటే ప్రజలు జకుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి వెళ్లడం లేదు. వేసవి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక చిన్నారులు, యువకులు స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్తున్నారు. వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. గుడారాలు వేసుకొని చిరు వ్యాపారులు పండ్లు, కూరగాయాలు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి అర్వపల్లి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ, యాదాద్రి



గొడుగు రక్షణగా..



అర్వపల్లిలో జ్యూస్ విక్రయాలు



దాహం తీర్చుకుంటున్న వానరం



యాదగిరిగుట్ట ఆలయం వద్ద..

## గుట్ట ఈవోగా వెంకట్రావ్ బాధ్యతల స్వీకరణ



గుట్ట ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రావ్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆలయ కార్యనిర్వాహణ అధికారి (ఈవో)గా ఐఏఎస్ అధికారి ఎస్. వెంకట్రావ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన గర్భాలయంలో స్వామి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన పూజారులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. వెంకట్రావ్ ఉమ్మడి నల్లగొండ జేసీ, యాదాద్రి జిల్లా ఆర్డీడీఏ పీడీగా పనిచేసిన సమయంలో పదోన్నతిపై మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా వెళ్లారు. అక్కడి నుంచి నారాయణపేట, సూర్యాపేట జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంకట్రావ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ డైరెక్టర్ జాయింట్ కార్యదర్శిగా పనిచేశారు. గుట్ట ఈవోగా పనిచేసిన ఏ. భాస్కర్‌రావుకు ఉద్యోగులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ జిల్లెల దయా కర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెం కటరామరావు, ప్రధాన అర్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, దాసోజు నరేష్, వేముల వెంకటేశ్, ముద్దసాని నరేష్, యాస రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు 25 రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం 25రోజుల్లో ఆరు అడుగుల మేర పెరిగింది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను నిలిపివేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 623.50 అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మూసీ నది పరీవాహక ప్రాంత గ్రామాలు, హైదరాబాద్‌లో కురుస్తున్న అకాల వర్షాలు, హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగు పోస్తున్నాయి. చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో ప్రాజెక్టుకు దాదాపు 380క్యూసెక్కుల పైచిలుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం ఒక్కో పాయింటు చొప్పున పెరుగుతూ వస్తోంది. 630.10అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మరో అడుగు పెరిగి 631.05అడుగులు(1.54టీఎంసీలు)గా నమోదైంది.

## స్వాతంత్ర్య సమరయోధురాలు కన్నమ్మ మృతి



కన్నమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ , ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట దళ సభ్యురాలు పశ్య కన్నమ్మ(90) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త తెలంగాణ సాయుధపోరాట దళ సభ్యుడు పశ్య రామిరెడ్డి గతంలోనే మృతిచెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆమె తెలంగాణ సాయుధపోరాటంలోనూ దళ సభ్యురాలిగా పనిచేశారు. 1941లో జరిగిన ఆంధ్ర మహాసభలో పాల్గొన్నారు. ఆమె సోదరుడు దళ కమాండర్ దొంతిరెడ్డి శంభిరెడ్డితో కలిసి అనేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కన్నమ్మ కుటుంబంపై రజాకారులు అనేకసార్లు దాడులు చేశారు. రజాకార్ల ఎదురుదాడిలో ఆమె సోదరుడు శంభిరెడ్డి అమరుడయ్యారు. 1971 నుంచి 1980 వరకు హుజూర్‌నగర్ మేజర్ గ్రామపంచాయతీ సభ్యురాలిగా, కోఆప్షన్ సభ్యులుగా పనిచేశారు. సీపీఐ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రతినిధిగా అనేక ఉద్యమాల్లో పనిచేశారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో 1970 నుంచి 2010 వరకు సుదీర్ఘ కాలం పాటు మహిళా సమాఖ్య బలోపేతానికి కృషి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పనిచేశారు. ఆమె కుమారుడు పశ్య శ్రీనివాసరెడ్డి, ఆమె కుటుంబమంతా సీపీఐలోనే ఉండి పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. పశ్య కన్నమ్మ మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు, బెజవాడ వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు. ఆమె మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.

## చివరిరోజు గుర్తుండిపోయేలా..

### హోంగార్డును సన్మానించి పోలీస్ వాహనంలో సాదరంగా ఇంటికి



హోంగార్డు వెంకన్నపై పూలు చల్లుతున్న సిబ్బంది

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న రంగపురి వెంకన్నకు చివరిరోజు గుర్తుండిపోయేలా వీడ్కోలు పలికారు ఎస్ఐ క్రాంతికుమార్, సిబ్బంది. మంగళవారం రాత్రి సీఐ నాగరాజుతో పాటు స్టేషన్‌లోని అన్ని విభాగాల సిబ్బంది, కుటుంబసభ్యుల సమక్షంలో వెంకన్నను ఘనంగా సన్మానించారు. సిబ్బంది కలిసి సమకూర్చిన రూ.60వేల నగదు ప్రోత్సాహకాన్ని వెంకన్నకు అందజేశారు. పోలీసులు ఆయనపై పూలవర్షం కురిపించి పోలీస్ వాహనంలోనే నల్లగొండలోని అతని ఇంటికి చేర్చారు.

# అకాల వర్షం.. రైతుకు నష్టం



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో తడిసిన ధాన్యం

తిరుమలగిరి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం కురిసిన అకాల వర్షం రైతులకు నష్టం మిగిల్చింది. నోటికాడికి వచ్చిన ముద్ద నేలపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉన్నా సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో కొనుగోలు కేంద్రాలు, మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో చాలా మంది రైతుల ధాన్యం తడిసి వరదలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా ప్ర భుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



డిండిలో వర్షానికి తడిసిన ధాన్యం ఎత్తుతున్న రైతులు

### ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం

నాగారం: నాగారం మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. ధాన్యం ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులు దాటినా జిల్లాలో మిల్లుల ఆలాట్‌మెంట్ ఆలస్యం కావడంతో ధాన్యం కొనుగోలు రోజురోజుకు ఆలస్యమతువున్నాయని ఐకేపీ నిర్వాహకులు తెలిపారు. సకాలంలో మిల్లులను సెంటర్లకు అలాట్ చేసి ఉంటే ధాన్యం కొనుగోలు 90శాతానికి పైగా పూర్తియ్యేవని రైతు లు వాపోతున్నారు. అధికారులు స్పందించి త్వరగా మిల్లుకు ధాన్యం తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఉరుములు.. మెరుపులు

దేవరకొండ: దేవరకొండలో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని నెలలుగా ఎండవేడిమికి అల్లాడుతున్న పట్టణ ప్రజలు చిరు జల్లులతో కూడిన వర్షం కురవడంతో కొంత ఊరట చెందారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పట్టణం లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

### పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి

డిండి: మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన జబ్బు పెద్దయ్యకు చెందిన రెండు ఎద్దులు పిడుగుపడి బుధవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన జబ్బు పెద్దయ్య తన రెండు ఎడ్లను వ్యవసాయబావి వద్ద చెట్టుకు కట్టేసి ఉంచాడు. సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులు, ఈదరుగాలులతో కూడిన వర్షానికి పిడుగుపడి రెండు ఎద్దులు మృతిచెందాయి. ఎద్దుల విలువ సుమారు రూ. లక్షకుపైగా ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.



డిండి : బ్రాహ్మణపల్లిలో పిడుగుపాటుకు మృతిచెందిన ఎడ్లు

### సకాలంలో ఎగుమతులు కాక..

డిండి: మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. డిండి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యంలోకి వర్షపునీరు చేరి తడిసిపోయింది. టార్పాలిన్లు ధాన్యం వర్షానికి తడవకుండా కాపా డుకోలేకపోయామని రైతులు ఆవేదన చెందారు. లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. ప్రతిరోజూ కేంద్రానికి ఒక లారీ మాత్రమే వస్తుందని రైతులు తెలిపారు. కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు అధికారులు కల్పించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

### శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండల కేంద్రంలోతో పాటు పలుగ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భారీ ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



శాలిగౌరారం: వల్లాలలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి రేకులు

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టా మూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టి అంకార వెండిజోడు సేవలు, సహ స్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజా నాకు రూ.17,45,185 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవారికి అష్టోత్తర సహస్ర, కుంకుమార్చనలు నిర్వహించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవారిని వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. గరుడ వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, తూమాటిశ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు పాల్గొన్నారు.

## 9 నుంచి నృసింహ జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయాలు పాతగుట్ట, దబ్బకుంటపల్లి ఆలయాల్లో స్వామివారి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో ఉదయం, సాయంత్రం కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. బచ్చన్నపేట మండలం దబ్బకుంటపల్లి ఆలయంలో 11న(ఆదివారం) ఉదయం 8.30గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, అభిషేకాలు, తిరిగి 10.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మహా నివేదన, తీర్థప్రసాద వితరణ, ఆశీర్వచనం చేస్తారు. జయంతోత్సవాల సందర్భంగా ప్రధానాలయం, పాతగుట్ట ఆలయాల్లో నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహోత్సవాలు, సుదర్శన నారసింహ హోమాలు, జోడు సేవలతో పాటు 11న ఉదయం జరిపించే నిజాభిషేకాలు, సహస్రనామార్చనలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

| | ఉదయం 8.45గంటలకు | సాయంత్రం 6 గంటలకు |
|---|---|---|
| 9న | స్వస్తివాచనం, విశ్వక్సేన పూజ పుణ్యాహవచనం, రుత్విక్ వరణం లక్ష కుంకుమార్చన, తిరు వెంకటపతి అలంకార సేవ | మృత్యంగ్రహణం, అంకురార్పణ హవనం, గరుడవాహనం పరవాసుదేవ అలంకార సేవ |
| 10న | నిత్య నృసింహ మూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన, కాళీయ మర్దన అలంకార సేవ | నృసింహ మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి, శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవ |
| 11న | ఉదయం నృసింహ మూలమంత్ర హవనాలు, మహాపూర్ణాహుతి తదుపరి సహస్ర కలశాభిషేకం నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠి | సాయంత్రం 7 గంటలకు విశేష తిరువారాధన, అర్చన, వేద స్వస్తి, ఉత్సవ పరిసమాప్తి |

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

నల్లగొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు-143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన సంఘం జిల్లా కార్యనిర్వాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడిటేషన్ నిబంధనలు మారిస్తే ఊరుకోబోమన్నారు. జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యోగానంద్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమణకుమార్, అవ్వారి భాస్కర్, అన్నెబోయిన మట్టయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారుతిసాగర్

# సత్తాచాటిన సూర్యాపేట జిల్లా గిత్తలు

### ఉభయ తెలుగు రాష్ట్రాల పోటీల్లో ప్రథమ స్థానం

మఠంపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లిలోని శుభవార్త దేవాలయ మహోత్సవాలను పురస్కరించుకొని శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్లపందేల పోటీలు మంగళవారం అర్ధరాత్రి ముగిశాయి. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా గిత్తలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో పల్నాడు, ప్రకాశం గిత్తలు, మూడో, నాలుగో స్థానాల్లో ప్రకాశం జిల్లా గిత్తలు, ఐదో స్థానంలో సూర్యాపేట మేళ్లచెర్వు గిత్తలు, 6వ స్థానంలో గుంటూరు, పల్నాడు, 7వ స్థానంలో కడప, బాపట్ల గిత్తలు, 8వ స్థానంలో గుంటూరు, కడప గిత్తలు నిలిచాయి. పోటీలను తిలకించేందుకు ఉభయ రాష్ట్రాల నుంచి ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### సీనియర్ విభాగంలో విజేతలు

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ములకలపల్లి సురేష్, సంధ్యకు చెందిన గిత్తలు(ప్రథమ), యండ్లకంటి వెంకటేశ్వర్లు పల్నాడు, ప్రకాశం జిల్లాకు చెందిన తనుష్‌కుమార్‌గౌడ్ గిత్తలు(ద్వితీయ), బి. విజయలక్ష్మనాయుడు ప్రకాశం గిత్తలు(తృతీయ) వీటితో పాటు మరో ఏడు గిత్తలు బహుమతులు గెలుచుకున్నాయని యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు నగదు, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, పాదర్ మార్టిన్ పసల, బ్రదర్ వినోద్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డుజల బాల్‌రెడ్డి, కె. చిన్నపురెడ్డి, భాస్క ర్‌రెడ్డి, బాలశౌరైడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న గిత్తలు

CLASSIFIEDS

పాస్ పోర్టు పోయినది

★ ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. C4757600 కేతేపల్లి నుండి బొప్పారం బైక్ మీద వెళ్తుండగా పోయినది. దొరికినవారు సంప్రః AVUDODDI NAVEEN, S/o. Lingaiah, Vill : Bopparam, Man : Kethepally, Nalgonda Dist. Cell : 7075643655

AJY_

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413365 9985413656

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

## అక్షయ తృతీయ కొనుగోళ్లు అంతంత మాత్రమే

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోలు చేస్తే ఆ ఇంట సిరుల పంట కురుస్తుందని నానుడి. ప్రతి అక్షయ తృతీయకు బంగారం దుకాణాల్లో సందడి చేస్తూ పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుండేవారు. ప్రస్తుతం బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో బుధవారం అక్షర తృతీయ సందర్భంగా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే జరిగాయి

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

నేరేడుచర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు కోరారు. బుధవారం పట్టణం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, సైదులు, జయబాబు, సుదర్శన్ పాల్గొన్నారు.

# ప్రతిభ చూపి.. పదిలో మెరిసి

### సూర్యాపేట నియోజకవర్గంలో..

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ కాకతీయ పాఠశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులుప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ కె. సంతోష్ తెలిపారు. 15మంది విద్యార్థులు 500మార్కులకు పైగా సాధించారని తెలిపారు. అదేవిధంగా విద్యాభారతి పాఠశాల విద్యార్థులు 500 మార్కులకు పైగా ఏడుగురు విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు.

● జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాలకు చెందిన 36మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించాపాఠశాల చైర్మన్ హరినారాయణ, ప్రిన్సిపల్ మేష్ తెలిపారు.

పెన్‌పహాడ్: మండలంలోని 11 పాఠశాలలకు చెందిన 312 మంది పరీక్షలు రాయగా 291 మంది ఉత్తీర్ణులై 93శాతం ఫలితాలు సాధించారు. దోసపాడు బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని కార్తీక 550 మార్కులు సాధించింది. అనాజిపురం మోడల్‌స్కూల్ విద్యార్థిని దీక్షిత 534 మార్కులు సాధించింది. కేజీబీవీ పాఠశాల విద్యార్థిని 524 మార్కులు సాధించింది. భక్తాళాపురం, అనాజిపురం, లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 100శాతం ఫలితాలు సాధించాయి.

### తుంగతుర్తి నియోజకవర్గంలో..

తుంగతుర్తి: మండలంలో పదో తరగతి విద్యార్థులు 96.6శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బోయిని లింగయ్య తెలిపారు. మండలంలో 533 మంది విద్యార్థులకు 512 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బీసీ గురుకుల విద్యార్థి కె.సాయిరెడ్డి 570 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలువగా సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పి. సిరిచందన 565 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది.

● తుంగతుర్తిలోని శ్రీ విద్యాభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 15మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి. మల్లయ్య తెలిపారు.

నాగారం: మండలంలో బీసీ గురుకుల విద్యార్థి నందకుమార్ 568 మార్కులతో టాపర్‌గా నిలిచారు.


చేతన 586


జగదీశ్వర్ 581


రశీదనస్రత్ 579


జయ ఆదిత్య 582


అక్షర 581

హుజూర్‌నగర్: పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ముస్కుల చేతన 586 మార్కులతో పట్టణంలో మొదటి స్థానం సాధించింది. అదేవిధంగా ఎ.జగదీశ్వర్ 581, ఎస్‌కే రశీదనస్రత్ 579, పి.రిత్విక్ 578, మనస్విని 576 మార్కులు సాధించారు. అనంతరం పట్టణంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పోసాని వెంకటరమణారావు తెలిపారు.

● హుజూర్‌నగర్‌లోని గ్రీన్‌వుడ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కె.జయఆదిత్య 582, అక్షర 581, తౌసిఫ్ 580, పి.హన్సిని 579, మనస్విమి 577, అబుబకర్ సిద్దిక్ 576, ఆర్.ప్రణవ్, 575, భానుప్రకాశ్ 574, చేతన్‌వర్మ 573, సీహెచ్ జస్మిత 573, ఎండీ షహిస్తాఖానమ్ 572, సాయిదినేష్ 571, లక్ష్మీప్రసన్న 570 మార్కులు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ టి.మర్రెడ్డి, డైరెక్టర్ సరిత రెడ్డి అభినందించారు.

● హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఐల మౌనిక 600/571 మార్కులు సాధించింది. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన నమిత 567 మార్కులు సాధించింది.

● హుజూర్‌నగర్‌పట్టణంలోని ఎండీఆర్ పాఠశాల విద్యార్థినులు వి.ఈశ్వరితేజ 574, డి.హనిశ్వి 574 సాధించారు. పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ మేరెడ్డి దామోదర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి తెలిపారు.

### రాణించిన శ్రీవాణి విద్యార్థులు

●నేరేడుచర్ల: పదో తరగతి ఫలితాల్లో నేరేడుచర్ల పట్టణంలోని శ్రీవాణి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. పర్వతం వర్షిత 574, గుగులోతు పూజిత 574 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించారు. పినాకిల్ స్కూల్ విద్యార్థిని పొట్టబత్తిని అంజన 570 మార్కులతో మూడో స్థానం సాధించింది. శ్రీవాణి పాఠశాల విద్యార్థినులు యామిని 565, ఎం జాహ్నవి 564 మార్కులు సాధించారు. ప్రగతి విద్యాలయం విద్యార్థి షేక్ అజ్మల్ రెహ్మాన్ 564 మార్కులు సాధించారు. దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దామరచర్ల ప్రణవి 564 మార్కులు సాధించింది. నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 94.76శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సత్యనారాయణరెడ్డి తెలిపారు.


హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు


వర్షిత 574


అంజన 570


పూజిత 574

●గరిడేపల్లి: మండలంలోని కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏ.పావని 534 మార్కులతో మండల ప్రథమ ర్యాంక్ సాధించినది. మొత్తం మండల వ్యాప్తంగా 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 264 మంది విద్యార్థులుండగా 254 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 96.21 శాతం ఫలితాలు సాధించారు.

### మేళ్లచెర్వు మండలంలో..

మేళ్లచెర్వు: మండల వ్యాప్తంగా 393 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 96.43 శాతం ఉత్తీర్ణతతో 379 మంది ఉత్తీర్ణతలు కాగా. మండల కేంద్రానికి ఐడియల్ హైస్కూల్‌కు చెందిన మారిశెట్టి ధరణి 573 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలవగా - మండల కేంద్రానికి చెందిన జిల్లా పరిషత్ పాఠశాలలో 532 మార్కులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ షేక్ రిజ్వానా ప్రథమస్థానం సాధించింది. చింతలపాలెం మండల కేంద్రంలో 117 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరు కాగా 94.02 శాతంతో 110 మంది ఉత్తీర్ణత సాధింఆరు. 148 మంది ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు 147 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దొండపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎం.శ్రీలక్ష్మి 547 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినట్లు మేళ్లచెర్వు చింతలపాలెం ఎంఈవోలు వెంకటరెడ్డి, శ్రీనివాస్ తెలిపారు.


ధరణి 573

### కోదాడ నియోజకవర్గంలో..

కోదాడ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తాళ్లూరి రేఖశ్రీ 571 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎండీ సలీంష రీఫ్ తెలిపారు. ఎస్‌ఆర్ఎం పాఠశాలకు విద్యార్థిని వర్షిణి 583, కె.జాహ్నవి 581 , డి.గౌతమి 580 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి తెలిపారు. తేజ పాఠశాలకు చెందిన భూక్యా భవ్యరాథోడు 565 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అప్పారావు తెలిపారు. శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన జి.వశిష్ట 590 మార్కులు సాధించినట్లు ఆర్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జయ పాఠశాలకు చెందిన కె.శరణ్య 580 మార్కులు సాధించిందని డైరెక్టర్ జ్యోతి తెలిపారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

● కోదాడ రూరల్: మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు 40మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఎరిగిరి జ్యోతికారెడ్డి 576, చిలక హరిణిజిత 573 మార్కులు సాధించారు. 500కు పైగా మార్కులను 28 మంది విద్యార్థులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు.

● చిలుకూరు: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 97 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మల్లెపంగు కీర్తి 537 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.


తాళ్లూరి రేఖ 571


కె..జాహ్నవి 581


వర్షిణి 583


గౌతమి 580

కొండాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మేఘన 527 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 46 మంది విద్యార్థులకు 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రామాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 41 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించారు.. మండలంలోని నారాయణపురం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం పాఠశాలల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. రామాపురం గురుకుల పాఠశాలలో 53 మంది విద్యార్థులకు 52 మంది ఉత్తీర్ణులయ్యారు. గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు

● మునగాల: పదో తరగతి ఫలితాల్లో మండలంలో 98.4 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూప్రజ్ఞ హైస్కూల్‌కు చెందిన తూముల మున్నీమేఘన 560 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కంచాని కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.


జ్యోతికారెడ్డి 576


ఎం.కీర్తి 537


మున్ని మేఘన 560

వెల్పుల సాయిశ్రీ 559 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. .మండలంలో 358 విద్యార్థులకు 353మంది ఉత్తీర్ణులై 98.6శాతం ఫలితాలు సాధించారు.

● తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్: తిరుమలగిరి మండల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శాంతయ్య తెలిపారు. తిరుమలగిరిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 459 మందికి 455 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. . తిరుమలగిరి, తొండ, తాటిపాముల, వెలిశాల, కేజీబీవో పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో మోడల్ స్కూల్ విద్యార్థిని సిహెచ్ సౌమ్యాబాయి 556 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలువగా, ప్రైవేటు విద్యాసంస్థల్లో కృష్ణవేణి పాటశాల విద్యార్థి యగ్నేష్వర్ 566 మార్కులు సాధించినట్లు తెలిపారు.నూతనకల్: మండలంలోని తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ముషం పవన్‌సూర్య 555 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించాడు. అదే పాఠశాలకు చెందిన విద్యార్థి మంచాల దయాకర్ 551 మార్కులతో మండలంలో మూడో స్థానంలో నిలిచాడు. నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వేల్పుల చరణ్ 555 మార్కులు సాధించాడు. మండలంలో కేబీజీవీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాములునాయక్ తెలిపారు.

● మద్దిరాల: మండలంలో బీసీ గురుకుల విద్యార్థిని సీహెచ్ స్నేహిత 580 మార్కులు, కేబీజీవీ, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో కాట్ల రవికుమార్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.


స్నేహిత 580

## సమాచారం

### నేటి మేడేని విజయవంతం చేయాలి

మఠంపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం నిర్వహించే మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్య పాండు నాయక్, రన్మియ, జగన్‌మోహన్‌రెడ్డి,వినోద్, కంటుకోటయ్య, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ రూరల్: మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మిక సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకన్న, రాము, శ్రీనివాస్, గోపయ్య, లక్ష్మి, పిచ్చమ్మ, వెంకటమ్మ, పద్మ, సాయి, సీతమ్మ పాల్గొన్నారు.

● చిలుకూరు: మేడేని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా, మండల నాయకులు సాహెబ్ అలీ, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, రెమిడాల రాజు, కాంపాటి వెంకటయ్య, లక్ష్మీనారాయణ, వస్రాంనాయక్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

### ఎంఈఎఫ్ రాష్ట్ర కమిటీలోకి శ్రీనివాసరావు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సంఘం(ఎంఈఎఫ్) రాష్ట్ర కమిటీలోకి నేరేడుచర్లకు చెందిన పగడాల శ్రీనివాస్(విద్యుత్‌శాఖ)ను తీసుకుంటున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేందర్‌ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నేరేడుచర్లలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్‌ప్రసాద్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి వెంకటేశ్వర్లు, మల్లిపాక వెంకన్న, జాన్‌విల్సన్, మామిడి సైదన్న పాల్గొన్నారు.

### ఉద్యోగులకు సన్మానం

కోదాడ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రీజినల్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్టీసీ ఉద్యోగులను బుధవారం కోదాడ డిపో తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభినందన పత్రాలు అందజేశారు. అదే విధంగా రీజనల్ స్థాయిలో ఉత్తమ బస్‌స్టేషన్‌గా కోదాడ డిపో ఎంపికైనందున స్టేషన్ మేనేజర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

పెన్‌పహాడ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులనుపారదర్శకంగా చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సూపర్‌వైజర్లు వెరిఫికేషన్ చేస్తున్నారని, తుది జాబితా ఎంపిక కావాల్సి ఉందన్నారు. తొందరపడి ఎవరూ అపోహలకు గురికావద్దని క్షేత్రస్థాయిలో విచారించి అర్హులను ఎంపిక చేస్తామని అన్నారు.









## జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి

మఠంపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన గణన ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొంతకాలంగా బీసీ నాయకులుగా చెప్పుకుంటున్న కొందరు బీసీలకు 42శాతం, 45శాతం, 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని హైదరాబాద్‌లో కూర్చొని తరచూ పత్రికా ప్రకటనలు ఇస్తున్నారని, ఎవరి దయాదాక్షిణ్యాలు బీసీలకు అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ జన గణన ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీని కోసం అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పున్నయ్య, వెంకట్, బుర్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లిలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

## బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తాం


బీజేపీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

అనంతగిరి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ నేత కడియం రామచంద్రయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి మండల ప్రభారి వ్యవస్థను రాష్ట్రం మొత్తం ఏర్పాటు చేయడం, పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుకుగా పాల్గొనే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంబేడ్కర్, అటల్ బిహారీ వాజ్‌పేయి జయంత్యుత్సవాలపై, వన్ నేషన్ వన్ ఎలక్షన్, మన్‌కీ బాత్ ప్రోగ్రాం ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు సీహెచ్ సతీష్, వంగవీటి శ్రీనివాసరావు, దండా శ్రీనివాస రెడ్డి, మల్లెబోయిన వెంకటేష్‌యాదవ్, బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

### నిజాయితీ చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్

పెన్‌పహాడ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ట్రాఫిక్ కానిస్టేబుల్ నిజాయితీ చాటారు. మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గండు అజయ్ బుధవారం తన పర్సులో రూ. 11వేలు పెట్టుకొని సూర్యాపేటకు బైకుపై వెళ్లాడు. పర్సు జారి పడిపోయింది. వెతకగా దొరకలేదు.. గంట తర్వాత పర్సులో ఉన్న నంబరు ఆధారంగా కొత్తబస్‌స్టేషన్ ఫ్లైవోవర్ కింద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆంజనేయులు అజయ్‌కు ఫోన్ చేశాడు. పర్సు తనకు దొరికిందని, వచ్చి తీసుకువెళ్లాలని కోరాడు. పర్సులో రూ. 11వేలు, కారు లైసెన్స్, ఆధార్‌కార్డు, ఏటీఎం కార్డు ఉన్నాయి. నిజాయితీగా పర్సును అప్పగించినందుకు కానిస్టేబుల్ ఆంజనేయులును అజయ్, స్థానికులు అభినందించారు.

### రిటైర్డు ఉద్యోగుల పుట్టినరోజు వేడుకలు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో రిటైర్డు ఉద్యోగులు ఉప్పల లక్ష్మారెడ్డి, మంచు శ్రీరాములు పుట్టినరోజు వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం కశ్మీర్ లోయలోని పెహల్గాం లోయలో ఉగ్రదాదుల దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, బుద్దారెడ్డి, బొడ్డుపల్లి సుందరయ్య, చావా వీరభద్రరావు, పోరెడ్డి శ్రీరాంరెడ్డి, జిలకర రామస్వామి, శశికళ, సైదిరెడ్డి, సీతారాములు పాల్గొన్నారు

### కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

మఠంపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని ఆ పార్టీ నాయకుడు సాముల శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్‌లు అన్నారు. మండలంలోని రఘునాథపాలెం, కృష్ణతండాల్లో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుల చిత్రపటాలకు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ మునిసిపల్ కౌన్సిలర్ మడిపల్లి విక్రమ్ తల్లి ఇందిర బుధవారం మరణించగా ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి ప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుడు గుడిసె శేఖర్ తండ్రి గుడిసె కొండయ్య ఇటీవల మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మోత్కూరు సందీప్, వల్దాస్ జాని, రాచకొండ కృష్ణ, ఉపేందర్, హనుమాన్, వసీం, నరేష్ పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

మునగాల:ఆపదలో ఉన్న గౌడ కులస్తుల కుటుంబాలను ఆదుకుంటామని టీజీ గౌడ్స్ యూనిఫామ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లపుదాసు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ నారగాని రాంబాబు కుటుంబానికి బుధవారం మండ కేంద్రంలో రూ.57వేలు అందజేసి మాట్లాడారు. తెలంగాణలో 190 మంది యూనిఫాం ఉద్యోగులు రూ.300చొప్పున ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండవ అంజయ్యగౌడ్, గుండు అంజయ్యగౌడ్, కొండా రాంబాబుగౌడ్, కారింగుల నాగయ్యగౌడ్, నారగాని కృష్ణగౌడ్, సుధాకర్‌గౌడ్, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

### వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించిన బసవేశ్వరుడు

సూర్యాపేట టౌన్: సమాజంలో కుల, వర్ణ, లింగ, వివక్షకు వ్యతిరేకంగా సామాజిక తత్వవేత్త బసవేశ్వరుడు ఉద్యమించారని వీరశైవలింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లెం శేఖర్ అన్నారు. బసవేశ్వరుడి జయంతి పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని శంకర్‌విలాస్ సెంటరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఆసంఘం నాయకులు వల్లెం ఉమామహేశ్వర్‌రావు, పరమేష్, సూర సోమేశ్వరీ, తొగరు ఉప్పమ్మ, ఏడకుల కోటయ్య, బత్తుల మల్లికార్జున్, శంకర్‌ప్రసాద్, ఆసంఘం నాయకులు పాల్గొన్నారు.

### శాంతిబాబు ఆశయాలను సాధించాలి

మునగాల: సీపీఎం సిద్ధాంతాల కోసం పోరాడిన మండవ శాంతిబాబు ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కలకోవ గ్రామంలో ఇటీవల మృతి చెందిన శాంతి బాబు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుర్రి శ్రీరాములు, కొంపల్లి లింగయ్య, జూలకంటి విజయలక్ష్మి, సైదా, బచ్చకూరి స్వరాజ్యం, బెల్లంకొండ సత్యనారాయణ,వెంటాద్రి, స్టాలిన్‌రెడ్డి పాల్గొన్నారు.

### గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా ఉండాలి

పెన్‌పహాడ్: గ్రామాల్లో ప్రజలు కుల వివక్షను వీడి ఐక్యంగా ఉండాలని తహసీల్దార్ ధరావత్ లాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని భక్తాళాపురం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడారు. ఎస్.ఐ గోపికృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవరైనా కులవివక్షత చూపితే ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఐ అజీజ్ నిషా, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆహార ప్యాకెట్లు అందజేత

కోదాడ రూరల్: పట్టణానికి చెందిన తూములూరి తులసి మహాలక్ష్మి, అచ్యుత జనార్దన్‌రావుల ద్వితీయ కుమార్తె శ్రీవైష్ణవి పుట్టినరోజు సందర్భంగా స్థానిక బస్టాండ్‌లో యాచకులు, పాదాచారులు 50 మందికి బుధవారం బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు గరిణె ఉమామహేశ్వరి శ్రీధర్, ఓరుగంటి విజయలక్ష్మి, పాండు, హైమావతి, స్వామి, కనకమహాలక్ష్మి, సునీత పాల్గొన్నారు.